
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
బుధవారం 16 ఏప్రిల్ 2025



పత్తి రైతులపై విత్తన భారం



పత్తి విత్తనాల ధర పెరుగుదల ఇలా..

సంవత్సరం	ప్యాకెట్ ధర
2019	రూ.710
2020	రూ.730
2021	రూ.767
2022	రూ.810
2023	రూ.853
2024	రూ.864
2025	రూ.901

- పత్తి విత్తనాల ప్యాకెట్‌పై రూ.37 ధర పెంపు
- జిల్లా రైతులపై అదనంగా రూ.30 లక్షల భారం
- జిల్లాలో 50 వేల ఎకరాల వరకు పత్తిసాగు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

తెల్లబంగారంపై ఆశలు పెంచుకొని పత్తిసాగు చేస్తున్న రైతులకు వచ్చే వానాకాలం సీజన్‌లో విత్తన భారం తప్పేలా లేదు. ప్రతీయేటా విత్తన ధరలు పెరుగుతున్నా కేంద్రం ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ లేదు. దీంతో ప్రైవేటు కంపెనీల విత్తనాలు కొనుగోలు చేయడం వల్ల పత్తి రైతులకు విత్తన మోత తప్పడం లేదు. తాజాగా 2025-26 సంవత్సరానికి బీటీ-2 పత్తి విత్తన 475 గ్రాముల ప్యాకెట్ ధరను రూ.901 నిర్ణయిస్తూ కేంద్ర వ్యవసాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గతేడాది పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.864 ఉండగా, ఈసారి రూ.37 అదనంగా పెంచుతూ నిర్ణయించింది దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులపై అదనంగా రూ.30 లక్షల వరకు భారం పడుతుంది. జిల్లాలో మిడ్‌మానేరు, మల్కపేట, అన్నపూర్ణ ప్రాజెక్టులతో పాటు ఎగువ మానేరు ప్రాజెక్టులోకి నీటిని నింపడం భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లోనూ నీటి మట్టాలు వానాకాలం సీజన్‌లో పెరుగుతున్న క్రమంలో జిల్లాలో రైతులు వరి పత్తిసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో జిల్లాలో లక్షకు పైగా ఎకరాల్లో పత్తి సాగు జరిగేది. ప్రస్తుతం 50 వేల ఎకరాల వరకు వానాకాలం సీజన్‌లో సాగు చేస్తున్నారు.

రానున్న ఖరీఫ్‌లో రైతులు వరితో పాటు పత్తివైపు మొగ్గు చూపుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం విత్తన భారం వేసింది. గతేడాది పత్తి విత్తనాల ప్యాకెట్ రూ.864 ఉండగా, ప్రస్తుతం రూ.901 వరకు పెంచారు. ఒక ప్యాకెట్‌పై రూ.37 పెరిగింది. దీంతో పాటు ఎరువులు, మందులు, వ్యవసాయ కూలీల ధరలు రైతులకు మరింత భారాన్ని పెంచింది. ఈసారి రైతులు దాదాపు రూ.30 లక్షల అదనపు భారాన్ని మోయాల్సి వస్తుంది. ప్రతియేటా విత్తనాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పత్తి పండించే రైతులు ప్రైవేటులోనే విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుంది. రైతులు ఎక్కువగా బీటీ 2 విత్తనాలనే వినియోగిస్తున్నారు. ఎకరానికి రెండు ప్యాకెట్లకు పైగానే ఉపయోగిస్తారు. మరోవైపు అనుకూల పరిస్థితులు లేనిపక్షంలో రెండోసారి కూడా విత్తనాలు వేసుకునే పరిస్థితి ఉంటుంది.

● వెంటాడుతున్న 'నకిలీ' భయం..

పత్తి రైతులను ధర భారంతో పాటు ప్రతియేటా నకిలీ విత్తనాల భయం వెంటాడుతూనే ఉంది. ఆంధ్రా, ఇతర రాష్ట్రాల నుంచి విత్తనాలను ముందుగానే తీసుకవచ్చి పత్తి రైతులకు అంటగడుతున్నారు. బహుళ జాతి కంపెనీల విత్తనాల ధర ఎక్కువగా ఉండడంతో ఎలాంటి లేబుల్ లేకుండా తక్కువ ధరకు అమ్మకాలు సాగిస్తున్న పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. విత్తనాలు మొలకెత్తని దశలో ల్యాబ్ నంబర్, విత్తన రకం, కంపెనీ పేర్లు లేకపోవడంతో రైతులు పరిహారం పొందే వీలు లేకుండాపోతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత ఖరీఫ్‌లో 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, పత్తి 49,332 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి సాగులో గంబీరావుపేటలో 220 ఎకరాలు, ఇల్లంతకుంటలో 12,412 ఎకరాలు, ముస్తాబాద్‌లో 760 ఎకరాలు, సిరిసిల్లలో 720 ఎకరాలు, తంగళ్లపల్లిలో 1,300 ఎకరాలు, వీర్నపల్లిలో 514 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 3,900 ఎకరాలు, వేములవాడలో 5,100 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 3,950 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈసారి కూడా వరితో పాటు 50 వేల ఎకరాల్లో పత్తి పంటను ప్రధానంగా వేయడానికి రైతులు సిద్ధం అవుతున్నారు. పత్తి సాగులో పెట్టుబడులు ప్రతీయేటా పెరుగుతూనే ఉన్నాయి. కూలీల ఖర్చుతో పాటు ఎకరానికి 10 నుంచి 12 వేల రూపాయల వరకు కలుపు తీయడానికే ఖర్చు చేస్తున్నారు. అనుకున్న మేరకు దిగుబడి రాక నష్టపోతున్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలివేంద్రం ద్వారా అందించే నీరు కక్షిదారుల దాహం తీర్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జల సంరక్షణతోనే సమగ్రాభివృద్ధి



మొక్క నాటుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్, ఎంపీడీవో తదితరులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జల సంరక్షణతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ఎంపీడీవో సత్తయ్యలు అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండా, బాకురుపల్లితండా గ్రామాల్లో వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శ్రమదానం చేసి మొక్కను నాటారు. వాటర్ షెడ్ పనుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి శ్రీహరి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, డీపీఎం పద్మయ్య, ఏపీవో కొమురయ్య, సిబ్బంది, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్ఐగా దిలీప్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్ఐగా ఆర్ఎస్ఐ దిలీప్‌ను నియమిస్తూ మంగళవారం ఎస్పీ మహేశ్ బి గితే ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేసిన ఆర్ఎస్ఐ రమేశ్‌ను జగిత్యాల జిల్లాకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో రమేశ్ జిల్లా నుంచి రిలీవ్ అయి జగిత్యాలకు వెళ్లారు. సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్ఐగా ఆర్ఎస్ఐ దిలీప్‌కు బాధ్యతలు చేపట్టారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

బోయినపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం కొదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత తనిఖీ చేశారు. అలాగే రుద్రవరంలోని ఆరోగ్య ఆయుష్ మందిర్ తనిఖీ చేశారు. రికార్డులు, మందులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రేణు, ప్రియాంక, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ పోలీస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలకు కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే 100 కు ఫోన్ చేయాలని సూచించారు.

మండేపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తంగళ్లపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండేపల్లిలో గ్రామ శాఖ అధ్యక్షేడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. జిల్లా ఫిషరీస్ జనరల్ సెక్రెటరీ చెన్నమనేని ప్రశాంత్, మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ధర్మారెడ్డి హారికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో ముందుకు సాగితేనే హక్కుల సాధన

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు ఐక్యతతో ముందుకు సాగితేనే హక్కులను సాధించుకోవచ్చని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. మండల కేంద్రంలోని కల్వరి బాప్టిస్ట్ చర్చిలో ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని పాస్టర్ల ఆత్మీయ సహవాసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దీపక్ జాన్ హాజరై మాట్లాడారు. క్రైస్తవులు ఐకమత్యంతో ఉండి దేశ శాంతి కోసం పాటు పడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ పాఠశాలల్లో ఏటా 10 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని అన్నారు. కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలఅన్నారు. సమావేశంలో పాస్టర్లు రత్నాకర్, రాజేశ్, నతానియల్, హిజ్కియా, దేవానందం, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

మే 1 నుంచి వేసవి క్రీడల ఉచిత శిక్షణ శిబిరాలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సహాయం కలెక్టర్ అనుమతితో మే 1 నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో పది క్రీడల్లో ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మే 1 నుంచి 31 వరకు 14 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలకు పది క్రీడలలో వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. బాలబాలికలకు శిక్షణ ఇవ్వడానికి ఉత్సాహంగా ఉన్న సీనియర్ క్రీడాకారులు, జాతీయ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ధ్రువపత్రాల కాపీలతో జత చేసి జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో ఈనెల 22న సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తులను ఇవ్వాలని పేర్కొన్నారు. శిక్షణ శిబిరంలో శిక్షణ ఇచ్చే కోచ్‌లకు గౌరవ వేతనం, శిక్షణ సామగ్రి సమకూర్చుతామని తెలిపారు.

సమాచార వ్యవస్థను మరింత మెరుగుపర్చుకోవాలి



గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో సూచనలు ఇస్తున్న ఎస్పీ మహేష్ బి గితే

గంభీరావుపేట/ముస్తాబాద్ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది పర్యటిస్తూ సమాచార వ్యవస్థను మెరుగుపర్చుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. గంభీరావుపేట, ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్లను మంగళవారం ఆయన తనిఖీచేశారు. పోలీస్‌స్టేషన్ల ఆవరణలో 5ఎస్ అమలుతీరు, సిబ్బంది వివరాలు అడిగితెలుసుకున్నారు. రికార్డురూం, రైటర్‌రూం తదితర అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు, నమోదు అవుతున్న కేసుల వివరాలు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ఎస్పీ రివ్యూ చేశారు. అనంతరం ఎస్పీ పలు సూచనలు చేశారు.

ఎగువ మానేరును సందర్శించిన ఎస్పీ..

గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయాన్ని ఎస్పీ మహేష్ బి గితే సందర్శించారు. ఎగువ మానేరు విస్తీర్ణం, ఆయకట్టు, నీటి సామర్థం, ప్రస్తుత నీటి నిలువ తదితర అంశాలను తెలుసుకున్నారు. వెంట డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు శ్రీనివాస్, మొగిలి, స్థానిక ఎస్ఐ ప్రేమానందం ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పోతిరెడ్డిపల్లి, నారాయణపూర్, దుమాల గ్రామాలకు బుధవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని సెస్ ఏఈ పృథ్వీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు కరెంటు తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు.

● వీర్నపల్లి : మండలంలోని గర్జనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగులుందని ప్రజలు సహకరించాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

ముస్తాబాద్ (గంభీరావుపేట) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండలం బంధనకల్, వెంకట్రావ్‌పల్లి, మొర్రాపూర్‌లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను మంగళవారం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, గ్రామ శాఖల అధ్యక్షులు రంజిత్, శ్రీనువాస్, రాజిరెడ్డి, గోవర్దన్, మండల ఇన్‌చార్జీ నాగం కుమార్, నాయకులు గజ్జెల రాజు, కొండం రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కార్యాచరణ

- ప్రధాన కూడళ్లు, అప్రోచ్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు - రోడ్ల మరమ్మతుకు చర్యలు - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలుచేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో, అప్రోచ్ రోడ్ల వద్ద స్పీడ్‌బ్రేకర్లు లేనందున అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని అలాంటి ప్రదేశాల్లో రబ్బరు స్ట్రిప్స్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు ప్రతిపాదనలుతయారు చేయాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు ప్రస్తుతం రేడియం స్టిక్కర్లు, సైన్‌బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. రోడ్లపై వ్యూ అంతరాయం కలగకుండా పిచ్చిమొక్కలు, పూర్తిగా తొలగించాలన్నారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో రేడియం సైన్‌బోర్డు ఏర్పాటుచేయాలన్నారు. జిల్లాలోని అంతర్గత ప్రాంతాల్లో జరిగే ప్రమాదాల నివారణకు అవసర మైన చర్యలు చేపట్టాలని రోడ్డు, మరమ్మతులపై శ్రద్ధ వహించాలని అవసరమైన చోట డీవైడర్లు, స్పీడ్ బ్రేకర్లు, స్పీడ్ కంట్రోల్ సోలార్‌లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అధికంగా తంగళ్లపల్లి, తిప్పాపూర్ ఎక్స్‌రోడ్డు, గంభీరావుపేట, కోనరావుపేట, ముస్తాబాద్, చందుర్తి, బోయినపల్లి కొదురుపాక జంక్షన్‌వంటి 13 ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటరమణయ్య, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, పీఆర్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో రజిత, ఆర్టీఏ కమిటీ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - అధికారులతో సమీక్షా సమావేశం

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యాసంగి పంట ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచడంతోపాటు రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో జిల్లాలో ప్రతిపాదించిన 240ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 119 ఐకేపీ, 21 సింగిల్ విండో, 7 మెప్మ, ఒక్కటి డీసీఎంఎస్‌లతో పాటు మొత్తం 148 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని మిగిలిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకవచ్చిన ధ్యానంలో తేమ శాతం, ఇతర ప్రమాణాలను పరిశీలించి ఎఫ్ఏక్యూ ఉన్న ధాన్యం మద్దతు ధరలపై కొనుగోలు చేసి ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు చేసి ధాన్యాన్ని ట్రక్‌షీట్స్ ప్రకారం సంబంధిత రైస్‌మిల్లులకు తరలించాలని, ఎక్కడైనా రైస్‌మిల్లర్లు ధాన్యం తీసుకోని పక్షంలో ఇంటర్మీడియట్ గోదాములకు తరలించాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న గోదాములను సమీపంలోగల కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేయాలని కలెక్టర్ కోరారు. ప్రతి మండలం సమీపంలో గల గోదాములను ధాన్యం భద్రపరిచేందుకు అద్దె పదతిలో తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, జిల్లాపౌరసరఫరాల శాఖ మేనేజర్ రజిత, వసంతలక్ష్మీ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

రుద్రంగి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం అన్నారు. రైతు పొలం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో విద్యుత్ వినియోగం, సమస్యలపై సెస్‌డైరెక్టర్ ఆకుల గంగారాం, సెస్ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావున విద్యుత్ మోటర్లను తడి చేతులతో ముట్టవద్దని, ఫ్యూజ్‌వైర్ పోయినప్పుడు సెస్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవడంతో నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. కార్యక్రమంలో సెస్ ఏఈ కుమారస్వామి, వేములవాడ ఏఏవో జగదీష్, మహేష్, కేసీరెడ్డి నర్సరెడ్డి, మోహన్, గంగాధర్, గంగారెడ్డి, నర్సయ్య, పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



సిరిసిల్లలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు



వేములవాడలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేములవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదాల నివారణపై వేములవాడ పట్టణంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు అగ్నిమాపక విభాగం అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను అగ్నిమాపక అధికారి అనిల్ తెలియజేశారు. కరపత్రాలు పంచి, అగ్నిప్రమాద నివారణ నియంత్రణ చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఉపాధ్యాయులు మల్లేశం, రవీందర్, కోటేశ్వర్, సలాం, బాలకృష్ణ, హమీద్, శ్రీలత, స్వరూప అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అగ్నిప్రమాదాల నివారణల కిట్‌లను ఏర్పాటు చేసి, ప్రమాదాల నివారణ చర్యలపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని అగ్నిమాపక అధికారి ఎస్ నరేందర్ కోరారు. సిరిసిల్ల పట్టణం గీతానగర్‌లోని బాలిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్, భారతి విద్యానిలయం, రెడియంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీచైతన్య స్కూల్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్నిమాపక అధికారులు ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రయోగాలతో అవగాహన కల్పించాలరు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లోకిని శారద, కరస్పాండెంట్‌లు నాగుల సంతోష్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కోల్‌సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తన వద్ద ఉండకుండా కూతురు అల్లుడి వద్దకు వెళుతుందనే మనస్తాపంతో గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఎండీ సాజిదా(42) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాజిదా భర్త గౌస్ ఖాన్‌తో విభేదాలతో తల్లి మలాన్‌బీ వద్ద ఉంటూ కూలి చేసుకుంటూ జీవిస్తోంది. ఆమె కూతురు సానియాకు వివాహం అయింది. రంజాన్ పండుగకు కూతురు సానియా గోదావరిఖనిలోని తల్లివద్దకు వచ్చింది. తిరిగి భర్త వద్దకు వెళ్లేందుకు సిద్ధం అవుతుండగా తల్లి సాజిదా అడ్డుకుంది. తన వద్దే ఉండాలని అల్లుడి వద్దకు వెళ్లవద్దంటూ గొడవ చేసింది. మంగళవారం సానియా అత్తగారింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాజిదా తల్లి మలాన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ట్రాలీని ఢీకొన్న లారీ

-ఒకరికి తీవ్ర గాయాలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్ శివారులోని వైన్స్ సమీపంలో ట్రాలీని లారీ ఢీకొనడంతో ట్రాలీ నడుపుతున్న కరీంనగర్‌కు చెందిన నవీన్‌కు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నవీన్ ట్రాలీ నడుపుకుంటూ కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టి వెళ్లింది.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేట గ్రామానికి ముత్యం వెంకటేశం గౌడ్(50) అనే వలస జీవి మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. సౌదీ అరేబియాలో గతనెల 13న వెంకటేశం గౌడ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం గ్రామానికి చేరుకోగా కుటుంబీకుల, బంధువుల రోధనలు మిన్నంటాయి. మృతుడికి భార్య పద్మ కుమారుడు, కుమార్తె ఉన్నారు.


గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

కొడిమ్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం ఆరెపల్లి గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని తుమ్మ నాగరాజు(21) అనే యువకుడు మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న చెర్లబూత్కూర్‌కు చెందిన నాగరాజును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న శేఖర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి.

మహిళను దూషించిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రామన్నపేటకు చెందిన శ్రీరాముల రమేశ్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన తునికి మాధవి అలియాస్ రాజేశ్వరి అనే మహిళను సోమవారం దూషించి, చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

విద్యుత్‌తో జాగ్రత్త



- అకాల వర్షాలు, ఈదురుగాలులతో ప్రమాదాలు
- అప్రమత్తతే ఆయుధం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అకాల వర్షాలు, ఈదురుగాలులు ఎక్కువగా సంభవిస్తుంటాయి. దీంతో విద్యుత్ తీగలు తెగిపడడం, స్తంభాలు నేలకొరగడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఇలాంటి సమయంలో తడిసిన స్తంభాలు, సపోర్టింగ్ తీగలను తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. ప్రధానంగా పొలాల వద్దకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చు. అకాల వర్షం కురుస్తున్నపుడు తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు/సపోర్టు తీగలను, స్తంభాలను, విద్యుత్ ఉపకరణాలను తాకరాదు. వేలాడుతున్న, వదులుగా ఉన్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను ముట్టుకోవద్దు. గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలి. ఇళ్లలో దుస్తులు ఆరవేసే జీఐ దండాల పైనుంచి విద్యుత్ వైర్లు వెళ్లడంతో విద్యుత్ వాటి ఇన్సులేషన్ దెబ్బతింటుంది. దీంతో దండాలు, పైపులకు విద్యుత్ సరఫరా అవుతుంది. ప్లాస్టిక్ దండాలు ఉపయోగిస్తే ఇలాంటి ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చు. విద్యుత్ వైర్లు దండాలు, రేకులకు తగలకుండా జాగ్రత్త వహించాలి. వ్యవసాయ మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు విద్యుత్ ప్రసారంతో ప్రమాదాలు సంభవిస్తాయి.

ఈ సమయంలో మోటార్లను, పైపులను, ఫుట్ వాల్వులను తాకరాదు. వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లకు ఎర్త్ ఏర్పాటు చేయాలి. ఎర్త్ లేని మోటార్లు, స్టార్టర్లు, జీఐ పైపులు, ఫుట్‌వాల్వ్‌లు అత్యంత ప్రమాదకరం. రైతులు, వినియోగదారులు స్వయంగా విద్యుత్ పనులు చేయవద్దు. అర్హులైన ఎలక్ట్రీషియన్‌ను సంప్రదించాలి. మూగజీవాలను మేతకు తీసుకెళ్లినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల దగ్గరికి వెళ్లకుండా జాగ్రత్త వహించాలి. ఇంటి వైరింగ్‌కు ఎర్తింగ్ చేయించుకోవాలి. ఇళ్లలో నాణ్యమైన విద్యుత్ స్విచ్ బోర్డులు, ఇతర వస్తువులను ఉపయోగించాలి. వ్యవసాయ మోటార్లు, ఇళ్లల్లో అతుకులు లేని సర్వీసు వైరును ఉపయోగించాలి. సెల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడడం ప్రమాదకరం. సమీపంలో ఎవరైన విద్యుదాఘాతానికి గురైతే ఆ వ్యక్తిని చేతులతో తాకరాదు. విద్యుత్ ప్రవహించని వస్తువులను (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వాడడం సరైన పరిష్కారం. ఇళ్లలో ఐఎస్ఐ మార్క్ ఉన్న స్విచ్ బోర్డులు, ప్లగ్‌లు ఇతర పరికరాలు వాడాలి.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

రమేష్ బాబు, ఎస్ఈ, టీజీ ఎన్‌పీడీసీఎల్

వర్షాలు, ఈదురుగాలుల సమంయలో విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రధానంగా పొలాల వద్దకు వెళ్లే రైతులు మోటార్లను నేరుగా తాకరాదు. మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా చూడాలి. ఇళ్లలో ప్లాస్టిక్ దండాలు వాడాలి. గ్రామీణ వినియోగదారులు క్షేత్రస్థాయి సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలి. విద్యుత్ అంతరాయం ఇతర సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేయాలి.



పోలీసులకు సమాచారం అందిస్తున్నాడనే హత్య

- నిందితుల అరెస్టు
- ఆయుధాలు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం

వేములవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి వ్యాపారానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందిస్తూ తమపై కేసు నమోదు కావడానికి కారణమవుతున్నాడనే కోపంతో ఐదుగురు వ్యక్తులు కలిసి చెట్టిపల్లి పరశురాములు అనే వ్యక్తిని హత్య చేశారని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. ఈ నెల 13వ తేదీన వేములవాడ పట్టణంలో పరుశురాములను దారుణంగా హత్య చేసిన ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆమె వెల్లడించారు. ఈ మేరకు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేసులో మృతుడు చెట్టిపల్లి పరుశరాములు, నిందితులు బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నేదూరి రాజేష్, అడ్డగట్ల మనోజ్ కుమార్ చాలా రోజులుగా స్నేహితులు అని, ఎప్పుడూ వారు కలిసి తిరిగేవారని తెలిపారు. వీరందరిపై వివిధ పోలీస్ స్టేషన్లలో గంజాయి, హత్యతో పాటు పలు రకాల కేసులు నమోదు కావడంతో జైలుకు కూడా వెళ్లి వచ్చారని తెలిపారు. కొద్ది రోజులుగా ఐదుగురు నిందితులపై పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసులు నమోదు కావడం పోలీసులకు పరుశరాములే సమాచారం ఇస్తున్నాడనే అనుమానంతో హత్యకు కుట్ర పన్నారని, ఇందులో భాగంగా 13వ తేదీ ఆదివారం బైపాస్ రోడ్డులోని మహాలింగేశ్వర గార్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్నాడని తెలుసుకొని వెంట తెచ్చుకున్న గొడ్డళ్లు, కత్తులతో బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్ విచక్షణారహితంగా దాడి చేసి నరికి చంపారని ఆమె తెలిపారు. రాజేష్ అనే వ్యక్తి బయట ఉండి ఎవరూ లోపటికి రాకుండా గేటు వేసి కాపు కాసాడని తెలిపారు. అడ్డగట్ల మనోజ్ కుమార్ మీరందరూ జైలుకు వెళ్తే బెయిల్‌పై తీసుకురావడానికి తాను బయట ఉంటానని చెప్పి హత్యకు ప్రోత్సహించాడని తెలిపారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు వేగవంతంగా విచారించి హత్యకు పాల్పడిన నిందితులు బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నేదూరి రాజేష్‌లను పట్టుకొని రిమాండ్ తరలించగా మరో వ్యక్తి అడ్డగట్ల మనోజ్ పరారీలో ఉన్నాడని తెలిపారు. హత్యకు ఉపయో గించిన రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, ఆయు ధాలను స్వాధీనం చేసుకున్నామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రమేష్, వెంకట్రాజం సమావేశంలో పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం

- నాగంపేట యువకుడి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



వినోద్ (ఫైల్)

గంభీరావుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన వినోద్(33) మృతిచెందగా, దేవేందర్ అనే మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం దేవేందర్‌ను హైదరాబాద్‌కు తరలిం చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన వినోద్ కొంతకాలంగా హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మధ్యనే నాగంపేటకు వచ్చిన వినోద్ ముంబాయిలో వేరే పనిచూసుకున్నాడు. కామారెడ్డి నుంచి ముంబాయికి ట్రైన్‌కు వెళ్లేందుకు నాగంపేట నుంచి స్నేహితుడు దేవేందర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. కామారెడ్డి సమీపాన ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంలో వినోద్, దేవేందర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ముందుగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొద్ది సేపటికే వినోద్ మృతిచెందాడు.

దేవేందర్ పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి



భూమేష్(ఫైల్)

కోరుట్ల రూరల్, (ఇబ్రహీంపట్నం) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం రేగుంట సమీపంలో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడి సోమవారం రాత్రి ట్రాక్టర్ యజమాని జక్కం భూమేష్(30) మృతి చెందాడు. ఇబ్రహీపట్నం ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణం గాజులపేటకు చెందిన జక్కం భూమేష్, డ్రైవర్ చింతల సాయిలుతో కలిసి ట్రాక్టర్‌లో ఇసుక లోడుతో ఇబ్రహీపట్నంకు వెళ్తున్న సమయంలో రేగుంట సమీపంలో బోల్తా పడింది. భూమేష్ మృతిచెందగా సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాదవశాత్తూ ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం



హుజూరాబాద్‌లో దగ్ధమైన ఎలక్ట్రిక్ స్కూటర్

హుజూరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం బోర్నపల్లి రోడ్ ఆహల్యనగర్‌లో మంగళవారం ప్రమాదవశాత్తూ ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని ఇద్దరు మైనర్ బాలురు ఎలక్ట్రిక్ స్కూటీపై వెళ్తుండగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన వారు స్కూటీని అక్కడే వదిలిపెట్టి పారిపోయారు. ఈ విషయాన్ని స్థానికులు ఫైర్ సిబ్బందికి తెలపగా వారు వచ్చి మంటలను ఆర్పేశారు. కాగా అప్పటికే స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కొండూరు కాంప్లెక్స్‌లో గుర్తు తెలియని దుండగుడు ఓ వృద్ధురాలి మెడలో నుంచి మంగళవారం పుస్తెలు తాడు అపహరించాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం కనపర్తి గ్రామానికి చెందిన అల్లపురెడ్డి కమలమ్మ-కొంరారెడ్డి వృద్ధ దంపతులు మంగళవారం జమ్మికుంటలోని ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో పని పూర్తి అయిన తర్వాత కూరగాయాలు కొనేందుకు కాంప్లెక్స్ మెట్ల వద్ద కూర్చున్నారు. వృద్ధ దంపతులను అనుసరిస్తున్న దండగుడు తాను ఓ గ్రామ కార్యదర్శిని అని, మీకు రూ.4వేల పెన్షన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఫొటో తీసే సమయంలో మెడలో పుస్తెలు తాడు ఉండకూడదని సూచించడంతో వృద్ధురాలు పుస్తెలు తాడు తీసి ఇచ్చింది. దుండగుడు వృద్ధ దంపతులు కళ్లు కప్పి అక్కడి నుండి నెమ్మదిగా జారుకున్నాడు. బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

డీఈవో కార్యాలయ భవనం పైనుంచి పడి అటెండర్ మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం(డీఈవో) భవనం రెండో అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి అటెండర్ కమ్ వాచ్‌మన్ గడప రవీందర్ కుమార్(58) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, మృతుడి భార్య వివరాల ప్రకారం.. కట్టరాంపూర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న రవీందర్‌కుమార్ 28 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాల అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం కట్టరాంపూర్ ప్రైమరీస్కూల్ అటెండర్‌గా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై కరీంనగర్ డీఈవో కార్యాలయ అటెండర్ కమ్ వాచ్‌మన్‌గా ఆరు నెలల నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో భవనం 2వ అంతస్థుపై ఆరేసిన బట్టలు తీసుకొని కిందకు వస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. తల, ఛాతీ, చేయికి బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రవీందర్‌కుమార్ భార్య ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైకిల్‌పై నుంచి పడి ఒకరి మృతి

పెగడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలో మంగళవారం వడ్లూరి మల్లయ్య (59) అనే వ్యక్తి సైకిల్ పై నుంచి పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మల్లయ్య ఇంటి నుంచి సైకిల్‌పై చెరువు కట్ట వైపు వెళ్తుండగా స్పృహ తప్పి రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్రాక్టర్ డబ్బాను ఢీకొట్టాడు. సైకిల్‌పై నుంచి పడడంతో తలకు రాయి తగిలి తీవ్ర రక్తస్రావమై మృతిచెందాడు. ఎండ ప్రభావం తాళలేక సైకిల్‌పై నుంచి పడి చనిపోయాడని మృతుడి కుమారుడు మధూకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేములవాడ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన వేములవాడ మండలం అనుపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అనుపురం గ్రామానికి చెందిన బండారి శ్రీహరి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అనుపురం గ్రామ శివారులో వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో శ్రీహరి (48) అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

పాలకుర్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. మంగళవారం కన్నాల టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, ప్రమాదకరమన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మల్యాలకు చెందిన గడుగు తిరుపతి అనే వ్యక్తిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గడుగు తిరుపతి మామిడి తోట కౌలుకు తీసుకొని అందులో ఉండగా అదే గ్రామానికి చెందిన బోదాసు శంకర్ మామిడి తోట నుంచి వెళ్తున్నాడు. ఎటు వెళ్తున్నావని శంకర్‌ను తిరుపతి అడిగాడు. ఈ క్రమంలో శంకర్ బండరాయి తట్టుకొని కిందపడిపోయాడు. అనంతరం ఆయన తిరుపతిని దూషించడమే కాకుండా బండరాయితో దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేయగా శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

చిగురుమామిడి,ఏప్రిల్ 15: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చేందిన బుర్ర రవీందర్(50) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సందబోయిన శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ తనుకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయానికి అనేక అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాడు. చేసిన అప్పులు పెరిగిపోవడంతో ఇంట్లో తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇటీవల కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించగా సాయంత్రం చికిత్స అందించేలోపే మృతి చెందాడు. మృతుడి కుమారుడు బుర్ర ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘాట్‌రోడ్డుపై అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

- ముగ్గురి గాయాలు

మల్యాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి మంగళవారం ముగ్గురికి గాయాలయ్యాయి. రాయికల్ మండలం తాట్లవాయికి చెందిన వినోద్, అతడి భార్య శ్రీవాణి, కూతురు వేదాంశికతో పాటు మరొకరు కొండపై నుంచి ద్విచక్ర వాహనంపై ఘాట్‌రోడ్డు మీదుగా కిందకు వస్తున్నారు. బ్రేకులు పనిచేయక ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో వాహనంపై గల వినోద్, శ్రీవాణి, వేదాంశికకు గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



తిరుపతి(ఫైల్)

జమ్మికుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గాకాలనీకి చెందిన పురంశెట్టి తిరుపతి (39) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బయట పని ముగించుకుని వస్తుండగా రైల్వే ఓవర్‌బ్రిడ్జి మీద నుంచి వస్తూ ముందు ఉన్న డీసీఎం వ్యాన్‌ను ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. డీసీఎం వ్యాన్ వెనుక టైర్ తల మీద నుంచి అక్కడికక్కడే మృతి చెందాడు. చాలా సేపటి వరకు ఎవరూ మృతుడి ఆనవాళ్లు గుర్తించలేకపోయారు. పోలీస్‌లు మృతుడి వద్ద లభించిన ఆధారాలతో దుర్గా కాలనీకి చెందిన నూరంశెట్టి తిరుపతిగా గుర్తించారు. మృతుడికి భార్య సృజన, కుమార్తె, కుమారుడు ఉన్నారు. డీసీఎం వ్యాన్ స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

● అధిక లోడు వల్లే ప్రమాదం?

డీసీఎం వ్యానులో అధిక లోడు ఉండటంతో బ్రిడ్జి డౌన్‌లో సరిగా బ్రేకులు పడవని స్థానికులు చర్చించుకుంటున్నారు. పది టన్నులలోడు వెళ్లాల్సిన వాహనాల్లో 15నుంచి 20టన్నుల వరకు వెళ్తున్నాయని, పట్టించుకోవాల్సిన అధికారులు తనిఖీలతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అధిక లోడు వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం



సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

గన్నేరువరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గత ఎన్నికల కోడ్ సమయంలో పోలీసులకు పట్టుబడిన 480 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ తాండ్ర నరేష్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ బాబా, ఎస్ఐ శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో ధ్వంసం చేశారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.86 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు

- అనుమతి కన్నా ఎక్కువగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- ఎల్లమ్మ చెరువులో యథేచ్ఛగా అక్రమ దందా

రామడుగు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం షానగర్ గ్రామంలోని ఎల్లమ్మ చెరువులో మట్టి తరలింపు ఇష్టారాజ్యంగా సాగుతున్నా పట్టించుకునేవారు లేరు. అధికారులు అనుమతించినదానికంటే ఎక్కువగా తవ్వకాలు జరుపుతున్నా అడిగేవారు లేరు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఒక వెయ్యి క్యూబిక్ మీటర్లు తరలింపునకు పెద్దపల్లి జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి నాలుగు లారీలకు అనుమతించింది. అధికారుల ఉదాసీనతతో కాంట్రాక్టర్ పదుల సంఖ్యలో వాహనాల ద్వారా మట్టిని తరలించడమే కాకుండా విద్యుత్‌శాఖకు చెందిన ఒక ట్రాన్స్‌ఫార్మర్, మూడు విద్యుత్ స్తంభా లను విరగగొట్టి యథేచ్ఛగా మట్టి తరలించినట్లు తెలుస్తోంది. దీనిపై ఫిర్యాదు అందినప్పటికీ కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

రాత్రింబవళ్లు తవ్వకాలు

రోజుకు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు మట్టిని రెండు ఎక్స్‌కావేటర్ల సహాయంతో నాలుగు లారీలతో మట్టిని తరలించాలని అధికారులు అనుమతులు ఇచ్చారు. వాటిని తుంగలో తొక్కి రాత్రింబవళ్లు తవ్వకాలు చేపట్టి వందలాది లారీల్లో మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెయ్యి క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే ఆరు రోజులు తీయాల్సి ఉండగా ఇప్పటికే పెద్ద ఎత్తున మట్టి తరలించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రెండు ఎక్స్‌కావేటర్లు పదుల సంఖ్యలో లారీలు నిత్యం నడుస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పర్మిషన్ ఇచ్చింది గోరంత, తవ్వకాలు కొండంత అన్నట్లు కాంట్రాక్టర్ వ్యవహార శైలి ఉండడం అధికారుల చేతివాటాన్ని చూపిస్తున్నదని గ్రామస్తులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ విషయమై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు మట్టి తరలించడానికి పర్మిషన్ ఇచ్చామని తెలిపారు. రైతులకు ఇచ్చినట్లయితే చెరువులో పదుల సంఖ్యలో లారీలతో ఎందుకు మట్టి తరలిస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. దీనిపై ఇరిగేషన్‌శాఖ ఈఈ సుధాకిరణ్‌ను వివరణ కోరగా ప్రస్తుతం తవ్వకాలు ఆపాలని ఎక్కువ మొత్తంలో మట్టి తరలిస్తే ఎంక్వయిరీ చేసి సదరు కాంట్రాక్టర్ నుంచి ఫైన్ వసూలు చేస్తామని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని సంబంధిత కాంట్రా క్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకొని పర్మిషన్ లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ఎల్లమ్మ చెరువులో తవ్వకాలు



మట్టి తరలింపు కోసం ఉన్న లారీలు



వారెవ్వా.. తాటిముంజలు

● వేసవి తాపాన్ని తీర్చే ఫలాలు

● పలు ఆరోగ్య ప్రయోజనాలు

మల్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నోరూరించే తాటి ముంజల సీజన్ వచ్చేసింది. ఏప్రిల్, మే నెలల్లో విరివిగా లభించే ఈ తాటి ముంజలను ప్రకృతి ప్రసాదంగా పేర్కొంటారు. వేసవి తాపాన్ని తీర్చడమే కాకుండా శరీర ఉష్ణోగ్రతలను సమతుల్యంగా ఉంచుతూ ఆరోగ్యానికి మేలు చేసే సుగుణాలు తాటి ముంజల ప్రత్యేకత. ఈ తాటిముంజలు కరీంనగర్-జగిత్యాల మార్గంలో గల కొండగట్టులో తాటి వనం అధికంగా ఉండడంతో ఎక్కువగా లభిస్తాయి. 100 రూపాయలకు 10 నుంచి 15వరకు తాటి ముంజలను విక్రయిస్తున్నారు.

పోషక విలువలు అధికం..: తాటి ముంజల్లో అనేక పోషక విలువలు ఉన్నాయి. వేసవిలో మాత్రమే లభించే ఈ తాటి ముంజలను మధుర ఫలంగానూ పేర్కొంటారు. ముంజల్లో 87 శాతం నీరు ఉంటుంది. అందులోని పోషక విలువలు వడదెబ్బ నివారణకు, శరీర ఉష్ణోగ్రతలను తగ్గించడానికి ఉపయోగపడతాయి. తాటి ముంజల లోపటి తెల్లని పదార్థం ఎండ తాపం నుంచి రక్షిస్తుంది. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న ఈ తాటి ముంజలు ప్రతి ఒక్కరూ రుచి చూడాల్సిందే.



తాటి ముంజలు చాలా ఇష్టం...



నీరజ, కరీంనగర్

తాటి ముంజలు అంటే నాకు చాలా ఇష్టం. వేసవి వచ్చిందంటే తప్పకుండా తింటాను. ప్రకృతి సహజ సిద్ధంగా లభిస్తున్న ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో చాలా పోషకాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ వేసవిలో తాటిముంజలను తీసుకుంటే మంచిది.

ఆరోగ్యానికి మేలు చేస్తాయి



పంజాల శివగౌడ్, గీత కార్మికుడు

తాటి ముంజలు ఎండ నుంచి రక్షిస్తాయి. అంతేగాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవి సీజన్‌లో రెండు నెలల పాటు విక్రయిస్తాం. ప్రత్యేకంగా దూర ప్రాంతాల నుంచి అనేక మంది వచ్చి తీసుకువెళ్తుంటారు.

భారీగా జిల్లా న్యాయమూర్తుల బదిలీలు

రాజన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పి. నీరజ

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 38మంది జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తుల బదిలీల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పి. నీరజను నియమిస్తూ మంగళవారం రాత్రి హైకోర్టు రిజిస్ట్రార్ ఆఫ్ విజిలెన్స్ ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్ల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా మూడేళ్ల విధులు నిర్వహించిన ఎన్. ప్రేమలతను గద్వాల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. సిరిసిల్ల పోక్సో అండ్ 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు జడ్జిగా పుష్పలతను నియమించారు. అదే విధంగా కరీంనగర్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎస్. శివకుమార్, పెద్దపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కె. సునిత, జగిత్యాల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రత్నపద్మావతిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాలలో పనిచేసిన పి. నీలిమ మెదక్‌కు, కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ప్రతిమను జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. కరీంనగర్ ఏసీబీ జిల్లా కోర్టు జడ్జిగా జె. విక్రమ్, కరీంనగర్ జిల్లా ఫ్యామిలీ కోర్టు అండ్ 4వ అడిషనల్ సెషన్స్ జిల్లా జడ్జిగా జె. కవితను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అగ్నివీర్ దరఖాస్తు గడువు 25 వరకు పొడిగింపు

జగిత్యాల అగ్రికల్చర్, పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నివీర్ దరఖాస్తు గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బి.సత్తెమ్మ, పెద్దపల్లి ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు తెలిపారు. ఇండియన్ ఆర్మీలో వివిధ కేటగిరీల వారీగా అగ్నివీర్‌లో జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 10వ తరగతి పాస్ మరియు అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ (8వ తరగతి పాస్) ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు వారి అర్హత ఆధారంగా ఏవైనా రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా ఐటీఐ, డిప్లమా, ఎన్‌సీసీ అర్హత పొందిన అభ్యర్థులకు బోనస్ మార్కులుంటాయని పేర్కొన్నారు. 13 భాషల్లో కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఆన్‌లైన్ విధానంలో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సికింద్రాబాద్‌లోని రిక్రూటింగ్ కార్యాలయం ఫోన్ నంబర్ 040-27740205లో సంప్రదించవచ్చన్నారు. ఔత్సాహిక అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీక్షా సమావేశం

భగత్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్ జోన్ పరిధిలోని రీజినల్ మేనేజర్‌లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు, అధికారులతో సంస్థ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రీజియన్ల, ఎలక్ట్రిక్ బస్సుల పని తీరుపైనా చర్చించారు. ఈ నెలలో అధిక పెళ్లి ముహూర్తాలు ఉన్నందున ప్రయాణికులకు సరిపడా బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి దృష్ట్యా అన్ని బస్ స్టేషన్‌లలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు, అకౌంట్స్ ఆఫీసర్లు, పర్సనల్ ఆఫీసర్లు, డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వర్క్స్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్లు పాల్గొన్నారు.

19న ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ జట్టు, సౌత్ జోన్ సీనియర్స్ మహిళల, పురుషుల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఒరిజినల్ ఆధార్‌కార్డుతో మధ్యాహ్నం 3 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, పీఈటీ శ్రీధర్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9441925807, 8978995730 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన అధ్యాయం

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన అధ్యాయం ప్రారంభించిందని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉగాదిని పురస్కరించుకొని సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. సన్నబియ్యం పంపిణీతో దళారి వ్యవస్థ కనుమరుగై పోయిందన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని భూ భారతి కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు.

గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో భూయాజమాన్య హక్కులు హరించబడ్డాయని ఆయన ఆరోపించారు. భూముల వివరాలు ఎవరైనా ఆన్‌లైన్‌లో చూసుకునేలా భూ భారతి చట్టం రూపొందించడం జరిగిందన్నారు. పారదర్శకతను పెంపొందించడానికి కాంగ్రెస్ సర్కారు ప్రయత్నం చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునః ప్రారంభించడంతో సమస్యలకు పరిష్కారానికి నూతన అధ్యాయం మొదలైనట్లయిందన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేశాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి అమలు చేయాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సీనియారిటీకి తగ్గట్టు గౌరవం లేక అసంతృప్తి

"కాంగ్రెస్‌లో నా స్థానం ఏమిటి..నా సీనియారిటీ ఏమిటి.. రాష్ట్రంలో కాంగ్రెస్‌లో మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంతరావు (వీహెచ్) తర్వాత నేనే సీనియర్‌ను.. జానారెడ్డి కూడా నా తదుపరి నాలుగు సంవత్సరాలకు కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్నారు..నా సీనియారిటీకి తగ్గట్టుగా గౌరవాన్ని పొందలేని పరిస్థితుల్లో అసంతృప్తితో ఉన్నా" అని జీవన్‌రెడ్డి అన్నారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎలాంటి పోరాటం చేశారో, శాసనసభా పక్ష నాయకుడిగా భట్టి విక్రమార్క ఎలాంటి పోరాటం చేశారో, శాసన మండలి నాయకుడిగా అదే స్థాయిలో తాను పోరాటం చేశానని జీవన్‌రెడ్డి తెలిపారు. శాసనమండలిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఒంటరి పోరాటం చేశానన్నారు.

నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నానన్నారు. జగిత్యాలలో కాంగ్రెస్ అంటేనే జీవన్‌రెడ్డి... జీవన్‌రెడ్డి అంటేనే కాంగ్రెస్ అన్న విధంగా పనిచేశానని ఆయన గుర్తు చేశారు. ఏదైనా అంశాల పట్ల భిన్నాభిప్రాయాలు కలిగి ఉండవచ్చని, అంతమాత్రాన పార్టీ వీడుతారని అనడం సబబు కాదన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు ప్రేమ్‌సాగర్‌రావు, రాజ్‌గోపాల్‌రెడ్డిలు వారికి ఉన్న పరిస్థితుల్లో పదవులు ఆశించడం తప్పుగా భావించొద్దని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, గాజుల రాజేందర్, చాంద్‌పాషా, పిప్పరి అనిత, మహిపాల్, రఘు, రమేశ్, శీలం నరేశ్, గుండ మధు తదితరులు పాల్గొన్నారు.

కష్టాలను కడతేర్చు బద్దిపోచమ్మ తల్లీ..

బోనం మొక్కులు చెల్లించుకున్న భక్తులు



బద్దిపోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కష్టాలను కడతేర్చి.. మమ్మల్ని చల్లగా చూడు బద్దిపోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారికి భక్తులు తెల్ల వారు జామునే మట్టి పాత్రలో నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్ల మధ్య నెత్తిన బోనాలతో శివసత్తుల నృత్యాలతో బైండ్ల వాళ్ల ఆటలతో ఊరేగింపుగా ఆలయానికి తరలి వచ్చారు. సుమారు రెండు గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించిన భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని బైండ్ల పూజారులతో పట్నాలను వేశారు. అనంతరం నూతవస్త్రాలను పెటి అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏఈవో లు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, అశోక్‌కుమార్‌లు, సూపరింటెండెంట్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నీరుకుళ్ల రంగనాయక స్వామి ఆలయంలో వైభవంగా శకటోత్సవం

రేపు రథోత్సవం



శకటోత్సవంలో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల రంగనాయకుల స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి వాహన సేవలకు సంబంధించిన శకటోత్సవం జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా వివిధ వాహనాలలో స్వామి వారిని ఊరేగించారు. ఆలయానికి సంబంధించిన వాహనాలతో పాటు నీరుకుళ్ల, వేగురుపల్లి గ్రామస్థులు ప్రత్యేకంగా తయారు చేసుకుని వచ్చిన ఏనుగు వాహనం పై స్వామి వారిని ఊరేగించారు. అనంతరం ఆలయం ఆవరణలో డోపు కథ వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, రాజ్‌కుమారాచార్యులు డోపు కథను వివరించారు.

● **డోపు కథ విశిష్టత:** తిరుమంగళయ్యార్ అనే భాగవతోత్తముడు నిత్య అన్నదాన కైంకర్యం చేస్తుంటాడు. నిత్యం చేయడం వలన అతని వద్ద ఉన్న ద్రవ్యం ఖాళీ అవుతుంది. తిరుమంగళయ్యార్ దారి దోపిడీ చేసి అన్నదానం కొనసాగిస్తాడు. ఒక రోజు దారి దోపిడీ చేస్తున్న సందర్భంలో శ్రీరంగ నాధుడే సపరివార సమేతంగా పెళ్లి వారి వేషధారణలో వస్తుండగా ఆ బృందాన్ని దోపిడి చేస్తాడు. స్వామి కాలివేలికి ఉన్న బంగారు ఉంగరాన్ని ఇవ్వమని అడుగుతాడు. అన్ని ఆభరణాలు నువ్వే లాక్కున్నావ, దాన్ని కూడా లాక్కో అంటారు స్వామి.

ఎంతకూ ఆ ఉంగరం రాదు. ఏమైనా మంత్రం వేశావా.. నాకు కూడా చెప్పవా అంటూ స్వామి వారిని తిరుమంగళయ్యార్ అడుగుతారు. అపుడు స్వామి అతడి చెవిలో నారాయణ అష్టాక్షరీ మంత్రం ఉపదేశించి కళ్లు తెరువు అంటారు. తిరుమంగళయ్యార్‌కు రంగనాధ స్వామి దివ్యమైన మంగళ స్వరూపాన్ని చూపిస్తాడు. ప్రతీ వైష్ణవాలయంలో రథోత్సవం కన్నా ముందు రోజు డోపు కథ వివరిస్తారు. కథ విన్న వారికి అష్ట ఐశ్వర్యాలు సిద్దిస్తాయని నమ్మకం.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సోమవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు ఆ రాత్రి కే కొండపైకి చేరుకొని అంజన్న దీక్షపరులు వేకువజామునే స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన కారు

వేములవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నిలిపి ఉన్న వాహనాన్ని అటవీశాఖ అధికారుల కారు ఢీకొట్టిన సంఘటన మంగళవారం వేములవాడలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు అల్లాడి రమేష్ స్థానిక వాసుదేవా టవర్స్‌లోని స్టేట్ బ్యాంక్‌కు పని నిమిత్తం వెళ్లి తన ఇన్నోవా వాహనాన్ని బ్యాంకు ఎదుట పార్కు చేసి లోపలికి వెళ్లారు. అదే సమయంలో అటవీ శాఖ అధికారులు ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి పార్కు చేసి ఉన్న ఇన్నోవా వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో కారు నడిపిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌తో పాటు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గాయపడంతో వారిని 108 వాహనంలో వేములవాడ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

మానకొండూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. వరి ధాన్యం రైసుమిల్లులో విక్రయించేందుకు రైతు ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నాడు. అన్నారంలోని లోలెవల్ బ్రిడ్జి వద్ద రోడ్డు గుంతలమయంగా మారడంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరుగలేదు.

లోలెవ్ బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో పలుమార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కళాకారులకు దేవాలయాల్లో ఉద్యోగాలు ఇవ్వాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దుబ్బుల కొలుపు కళాకారులకు దేవాలయాల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జునుగరి దుర్గయ్య కోరారు. మంగళవారం నగరంలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దుబ్బుల కొలుపు కళాకారులను సాంస్కృతిక శాఖలో గుర్తింపు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంలో అవ కాశం కల్పించాలని కోరారు. వృద్ధ కళాకారులకు పింఛన్ ఇవ్వాలని, ఇళ్లు లేని వారికి పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఉచిత హెల్త్‌కార్డులు ఇవ్వాలని అన్నారు. ప్రతీ కొలుపు కళాకారుడికి వ్యక్తి గత పూచీకత్తుపై లక్ష రూపాయల రుణం ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు జునగరి లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిరి శ్రీకాంత్, గౌరవ సలహాదారుడు లెల్లెల బాలకృష్ణ పాల్గొన్నారు.

ధర్మపురి బోయవాడలో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

ధర్మపురి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని బోయవాడలో చోరీ జరిగింది. బోయవాడకు చెందిన గడప రమేష్ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ.80 వేల నగదు, 7 తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు అపహరించుకవెళ్లారు, వచ్చిన వ్యక్తులు ఇంటిలో ఒక పెట్టెలో దాచి ఉన్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. పెట్టె తెరచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు రమేష్ మంగళవారం గుర్తించాడు. వచ్చిన వ్యక్తులు రమేష్ ఇంటిని నాశనం చేస్తామని అక్కడే ఒక లేఖను వదిలి వెళ్లి పరారయ్యారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కాగా చోరీ ఎప్పుడు జరిగిందో తెలియ రావడం లేదు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,600 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఐదుగురు రైతులు 75క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు ఆరు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంచం పట్టిన విద్యార్థులు

● 30 మందికి జ్వరం ● కోరుట్ల ఆసుపత్రిలో 14 మందికి చికిత్స

కోరుట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 30 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం



జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు మందులను అందజేసిన వైద్య సిబ్బంది

ఉదయం జ్వరంతో బాధపడుతున్న 14 మంది విద్యార్థులను కోరుట్ల పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు వైద్య పరీక్షలకు తీసుకువచ్చారు. వారిలో ఒక విద్యార్థి తీవ్ర జ్వరంతో బాధపడగా వైద్య సిబ్బంది అప్రమత్తమై విద్యార్థులను కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని విద్యార్థుల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం గురుకుల పాఠశాలలో ఆయన ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. 30 మంది విద్యార్థులకు జ్వరం ఉన్నట్లు గుర్తించి వారికి వైద్యం అందించారు. విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం టీ హబ్‌లోని ల్యాబ్‌కు తరలించారు.

కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో పాటు పాఠశాలలో జ్వరంలో బాధపడుతున్న వారిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులు వేర్వేరుగా పరామర్శించి



కోరుట్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులతో విద్యార్థులకు జ్వరం వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు జ్వరం తగ్గడంతో సాయంత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. గురుకులంలో వైద్య శిబిరం కొనసాగిస్తున్నారు. విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పలువురు తల్లిదండ్రులు వారిని ఇంటికి తీసుకెళ్లారు.

రెడ్డి సంఘం కార్యవర్గం

చందుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బద్దం తిరుమల రెడ్డి, గౌరవ అధ్యక్షులు దారం బాల్‌రెడ్డి, దూది శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా పూడూరి ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కూతురు మహేందర్‌రెడ్డి, ఏరెడ్డి రాజిరెడ్డి ఎడమల ఆదిత్యరెడ్డి, ఎల్లాల తిరుపతిరెడ్డి, కార్యదర్శిగా నాయిని బాపురెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఏనుగు లచ్చిరెడ్డి, కోమటి జలంధర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎడమల శ్రీనివాస్ రెడ్డి, గడ్డం బాపురెడ్డి, నల్మాస్ రవీందర్‌రెడ్డి, అనుపటి రాంరెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, ప్రధానసలహాదారులుగా బాణాల మల్లారెడ్డి వెంకట్‌రెడ్డి, అంచ శ్రీహరిరెడ్డి, దారం హన్మంతరెడ్డి, కొత్త శ్రీనివాస్ రెడ్డిలను ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.

ఎండ తీవ్రత, ప్రభుత్వ పథకాలపై కళా ప్రదర్శన

చందుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం, సనుగుల గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక కళా బృందం మంగళవారం కళా ప్రదర్శన ఇచ్చారు. ఎండ తీవ్రతపై, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పాట, మాట ద్వారా చక్కని కళా ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి వేములవాడ టీం లీడర్ పొత్తూరి రాజు. కళాకారులు గడ్డం దేవయ్య, పూడూరు సంజీవ్, అంతర్పుల ఝాన్సీ, లావణ్య, కిన్నర, శ్రీలత, శిరీష, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

చందుర్తి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని సనుగుల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముఖేష్ అన్నారు. మండలంలోని సనుగుల గ్రామంలో మంగళవారం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేకల పద్మ, కోరెపు శ్రీనివాస్, న్యాతరి నాగమణి, చింతల హరిష్మా, పాల్గొన్నారు.

కొనుగోళ్ల కోసం ఎదురుచూపులు


చందుర్తిలో ఆరబోసిన ధాన్యం

చందురి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ధాన్యం కొనుగోలుకు రైతులు ఎదురుచూస్తున్నారు. పౌరసరఫరాల శాఖ ఇప్పటివరకు కిష్టంపేట, జోగాపూర్, రామారావుపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ప్రారంభించినా ధాన్యం తూకం వేయడం లేదు. మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం తూకం వేయడం ప్రారంభించారు. గ్రామాల్లో పలుచోట్ల రైతులు పంట కోసి కేంద్రాల వద్ద వడ్లను ఆరబెట్టారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో తేమశాతం అమ్మకానికి అనుగుణంగా ఉన్నా కొనుగోలు చేపట్టడం లేదు. అకాలవర్షాలు వస్తే ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు వాపోతున్నారు. మండలంలో ఈ యాసంగిలో లక్షా 50 వేల క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు అంచనా వేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో 13, సనుగుల పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ముందే సాగు చేసిన రైతులు తమ వరి కోతల్ని పూర్తి చేసుకొని వడ్లను కేంద్రాల వద్దకు తర లించారు. ప్రస్తుతం పగటి పూట ఎండలు తీవ్రంగా ఉంటూ రాత్రి వేళ అకాల వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎంత తొందరగా అమ్ముకుంటే అంత మంచిదన్న భావనలో రైతులు ఉన్నారు. ఈ వారంలో కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యాన్ని పరిగణలోకి తీసుకొని ఇంకా ముందుగానే కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ఈసారి సన్నవడ్లకు బోనస్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గత వర్షాకాలంలో మొత్తం సన్నరకాలకు క్వింటాలుకు రూ. 500 వందల చొప్పున బోనస్ అందజేసింది. ఈసారి అవే రకాలకు బోనస్ అందజేయాలని నిర్ణయించింది.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

చిలుక పెంటయ్య, మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు



రైతులు వరికోతలు ప్రారంభించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలిస్తున్నారు. కేంద్రాల్లో ధాన్యం రాసులు పేరుకుపోతున్నాయి. సాయంత్రం, రాత్రివేళలో వర్షం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన చోట ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలి.

ధాన్యం వద్ద కాపలా కాస్తున్నాను..

- మర్రి రాజు, రైతు, చందుర్తి



చందుర్తిలో కొనుగోలు కేంద్రానికి 15 రోజుల క్రితం ధాన్యం తీసుక వచ్చాను. అప్పటి నుంచి ప్రతి రోజు కొనుగోలు కేంద్రంలో ధాన్యం వద్ద కాపలా కాస్తూ ఉన్నాను. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి. అకాల వర్షం కురిస్తే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

చలో వరంగల్ సభను విజయవంతం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య పిలుపునిచ్చారు. సభ వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఓ ఫంక్షన్ హాలు ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆగయ్య మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలించేలా నాయకులు, కార్యకర్తలు చూడాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆగయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు సుభాష్, రమేశ్, సందీప్, నర్సింలు, సుధాకర్‌రావు, జబ్బార్, అప్సరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో వరంగల్ సభ విజయవంతంపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మండల యూత్ అధ్యక్షుడు సామల్ల దేవరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ అందె సుభాష్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, శ్రీరాంనాయక్, రఫీ, తులసీరాం, లింబయ్య, తిరుపతి ఉన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో చలో వరంగల్ రజతోత్సవ సభవాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, బండి దేవదాస్, మాట్ల మధు, పడిగెల మానసరాజు, కోడూరు భాస్కర్‌గౌడ్, వలకొండ వేణుగోపాలరావు, ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, బండి జగన్, గుగ్గిళ్ళ అంజయ్య, గుండు ప్రేమ్‌కుమార్, చిలువేరి చిరంజీవి, ఏసి రెడ్డి రామ్‌రెడ్డి, అమర్‌రావు, ఆవునూరు వెంక టరాములు, క్యారం జగత్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

● ముస్తాబాద్ (గంభీరావుపేట) : ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు జనసమీకరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురెందర్‌రావు, మాజీ జిల్లా కోఆప్షన్ సర్వర్‌పాష, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు మల్లేశం, యూత్ అధ్యక్షుడు స్వామి, మహిళా అధ్యక్షురాలు బాల్‌లక్ష్మి, రాములు, స్వర్ణలత ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి సీఐ జీ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు మంగళవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో రాత్రి వేళల్లో ఎక్కువగా దొంగతనలు జరిగే అవకాశం ఉంటుందని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత చెడు మార్గంలో వెళ్లకుండా, సన్మార్గంలో ప్రయాణించాలన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటితో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులలో ఏదైనా సమస్య ఎదురైనచో డయాల్ 100ఉపయోగించుకోవాలని, పోలీసులు ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటారన్నారు. మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న అఘాత్యాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.అంజయ్య, పంచాయతీ కార్యదర్శి కవిత, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర మహాసభలు

వేములవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఏఐటీయూసీ భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు కోరారు. వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర మహాసభల పోస్టర్ ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. శంషాబాద్‌లో ఈనెల 21,22 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గాజుల పోశెట్టి, కోరేపు శ్రీనివాస్, లక్ష్మణ్, లింగం, నరేష్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు తొలగించాకే రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని బైపాస్ రోడ్డులో విద్యుత్ స్థంబాలు తొలగించాకే రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీజేపీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామిగౌడ్ ఒక ప్రకటనలో కోరారు. రోడ్డు మధ్యలో విద్యుత్‌స్తంబాలు ఉండగానే పనులు కొనసాగుతున్నాయని,ఇలాగే ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పెద్దలింగాపూర్ తొలి సర్పంచ్ మృతి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ మొదటి సర్పంచ్ కేతిరెడ్డి రాంరెడ్డి (95) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం 1958లో తొలి సర్పంచ్‌గా పనిచేశాడు. కొంత కాలానికి సెస్‌డైరెక్టర్‌గానే సేవలు అందించాడు. అనారోగ్యంతో బాధపడుతున్న రాంరెడ్డి కరీంనగర్‌లో ఆసుపత్రిలో మృతిచెందాడు. తొలిసర్పంచ్ మృతి పట్ల గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

సారథి కోఆర్డినేటర్‌గా వంతడ్పుల గణేష్

సిరిసిల్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతిక సారధి రాజన్న సిరిసిల్ల జిల్లా కోఆర్డినేటర్‌గా వంతడ్పుల గణేష్, గౌరవ సలహాదారులుగా శ్రీరాముల రామచంద్రం, గడ్డం దేవయ్యలను ఎన్నుకున్నారు. మంగళవారం సిరిసిల్లలో సారధి కళాకారుల సమావేశం జరిగింది. సిరిసిల్ల టీమ్ లీడర్‌గా గడ్డం శ్రీనివాస్, వేములవాడ టీం లీడర్‌గా పొత్తూరు రాజులను ఎన్నుకున్నారు.

చిత్రకారుడికి సన్మానం

వేములవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా చిత్రకారుడు ఇందూరి మధును మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా ప్రదర్శన

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామంలోని బస్టాండు ప్రాంతంలో తెలంగాణ సాంస్కృతిక జిల్లా ప్రతినిధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాకారులు ప్రభుత్వ పథకాలపై మంగళవారం కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పల్లెల్లో పారిశుద్ధ్యం తదితర అంశాలను తమ ఆటాపాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు గణేశ్, పర్శరాములు, శ్రీధర్‌రెడ్డి, రామచంద్రం, స్థానికులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 126 మందికి పరీక్షలు జరిపి 31 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా చికిత్స అందించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు సతీష్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, లింగారెడ్డి, రామచంద్రం, లక్ష్మారెడ్డి, కిషన్, లక్ష్మణ్, ముత్యంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, బాల్‌రెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

భూములకు నష్టపరిహారం అందించాలి

కోనరావుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ కింది భాగంలో ఉన్న ఊర చెరువులో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులు మంగళవారం మల్కపేట రిజర్వాయర్ కుడి కెనాల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్కపేట రిజర్వాయర్ నుండి ఊర చెరువులోకి కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయడంతో ఊర చెరువు నిండి భూములు మునిగిపోతున్నాయని అన్నారు. కోల్పోతున్న భూములకు నష్టపరిహారం అందించారని కోరారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

కోనరావుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు సమపాలల్లో కూడిన ఆహారం అందించినప్పుడే పిల్లల ఎదుగుదల బాగుంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకమ్మ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల బరువును పరీక్షించి తక్కువ బరువు ఉన్న పిల్లలకు ఆహారం ఎలా అందించాలి అనే విషయంపై సూచించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలకు మంచి ఆహారం అందించాలని, అంగన్వాడి టీచర్లు అరుణ, మంగ, సీసీ రవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


లింగంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు


మండెపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వరూప, నాయకులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపల్లి, బొల్లారం, హన్మాజిపేట, అచ్చన్నపల్లి, నమిలిగుండుపల్లి గ్రామాల్లో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ రొండిరాజుతో కలిసి ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి ప్రారంభించారు. సెస్ డైరెక్టర్ దేవరాజం, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పర్శరాం, పర్శరాం, స్రవంతి, ప్యాక్స్ డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, నాయకులు సంఘస్వామి, సామ తిరుపతిరెడ్డి, వంగపల్లి మల్లేశం, ఎల్లా గౌడ్, ఆదిల్, ప్రవీణ్, దానె కొమురయ్య, చిలుక ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం మండేపల్లి, గండిలచ్చపేట, తంగళ్లపల్లి, కస్బెకట్కూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి ప్రారంభించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని ముస్కానిపేటచ తాళ్ళపెల్లి, నర్సక్కపేట, రహీంఖాన్‌పేట, వెల్జీపూర్, వల్లంపట్ల తదితర 15 గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్యాక్స్ మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఏపీఎం వాణిశ్రీ, ఏఎమ్‌సీ డైరెక్టర్లు వీరేశం, రాజేశం, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతి గౌడ్, రాంప్రసాద్, సత్యారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెలిచాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజలు కొనుగోలు చేస్తామని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండలంలోని కనగర్తి, మామిడిపల్లి తదితర గ్రామాల్లో సింగిల్ విండో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య, వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి, లింగంపల్లి లక్ష్మి, దేవరాజు, ఎగమంటి ఎల్లారెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా నువ్వు పంట..

చందుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆరుతడి పంట అయిన నువ్వు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. యాసంగిలో తక్కువ నీటితో సాగు అయ్యే నువ్వు పంటపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని మూడపల్లి తిమ్మాపూర్, చందుర్తి, అనంతపల్లి, మర్రిగడ్డ, జోగాపూర్, లింగంపేట, సనుగుల, బండపల్లి, ఎన్గల్, మల్యాల గ్రామాల్లోని రైతులు దాదాపుగా 100ఎకరాల్లో సాగు చేశారు. నువ్వు పంట మూడు నెలల పంట ఇప్పటికే నువ్వు పంట వేసి రెండు నెలల కాలం గడిచిపోయింది. ఈ పంటకు తక్కువ నీరు అవసరం ఉంటుంది. ప్రస్తుతం పంట ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉంది. అయితే పూత, మొగ్గ దశలో పంట ఉన్నప్పటికీ వాతావరణంలో మార్పుల కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. పొడి వాతావరణం ఉంటే అధిక దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 5 నుంచి 6 వేల వరకు ఖర్చు అవుతుందని, దిగుబడి ఎకరానికి 4 క్వింటాళ్ల వరకు వస్తాయన్నారు. వాతావరణం అనుకూలించకపోతే రెండు క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. పంటను విక్రయించేందుకు సరైన మార్కెట్ సౌకర్యం లేదని రైతులు వాపోతున్నారు. దళారులకే తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.20 వేలలోపు ధర ఉన్నట్లు రైతులు తెలిపారు. కాగా, రైతులు నువ్వు పంటకు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి అనూష తెలిపారు. పేనుబంక, బూడిద తెగులుతో పూతరాలిపోకుండా సూచనలు పాటించాలన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితా సేకరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికకు కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఇందిరమ్మ ఇళ్ల పథకంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లు ఉండటానికి వీలు లేదని, వచ్చిన దరఖాస్తుల్లో అత్యంత నిరుపేదలకు మాత్రమే మొదటివిడతలో ఇళ్లు మంజూరుచేయాలని, జిల్లాలో రెండు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 7వేల ఇళ్లు నిర్మిస్తున్నామని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై పలు సూచనలు చేశారని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరుచేసిన 3500 ఇండ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాలు ఎంపిక చేసిన గ్రామాలలో కొన్ని ఇళ్లు మంజూరుచేశామని, మిగిలినవి గ్రామాలు, మున్సిపల్ వార్డులవారీగా మంజూరు చేసేందుకు అలాట్మెంట్ తయారు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అర్హత ఉండి ఇంటి స్థలం ఉన్న దరఖాస్తుల సంఖ్య ప్రాతిపదికగా సదరు గ్రామాలకు, వార్డులకు ఇండ్ల కేటాయింపు ఏప్రిల్ 17 లోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామాలు, వార్డులలో ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి, అర్హుల జాబితాలో నుంచి మొదటి విడత మంజూరు చేసేందుకు గ్రామానికి అలాట్మెంట్ చేసిన ఇండ్ల సంఖ్యకు లబ్ధిదారుల ఎంపిక చేయాలని సూచించారు. ఏప్రిల్ 21లోపు ఇందిరమ్మ కమిటీల నుంచి ప్రతి గ్రామానికి, వార్డుకు అలాట్‌చేసిన ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల జాబితా వివరాలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలలో 1023 ఇండ్లు మంజూరు చేశామని, ముందస్తుగా నిధులు ఇబ్బందులు ఉన్నవారికి స్వశక్తి మహిళా సంఘాల ద్వారా రుణం అందించి పనులు ప్రారంభించాలన్నారు. సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి రాధాబాయి, పీడీ హౌసింగ్ శంకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసం యూనిట్ల గ్రౌండింగ్‌కు సహకరించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం క్రింద నిరుద్యోగ యువతీ యువకులతో వివిధ వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్‌కు బ్యాంకర్లు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, రాజీవ్ యువ వికాసంపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, బ్యాంకర్లతో వీసి ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. జిల్లాలో బ్యాంక్ బ్రాంచీల వారిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ యూనిట్ల లక్ష్యాలను కేటాయించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 50 వేల రూపాయల వరకు వంద శాతం సబ్సిడీ, లక్ష రూపాయల వరకు 90 శాతం సబ్సిడీ, 2 లక్షల వరకు 80 సబ్సిడీ, 4లక్షల వరకు 70శాతం సబ్సిడీతో యూనిట్ల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 27 వరకు వచ్చిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను మండలాల వారిగా, మున్సిపాలిటీలలో ప్రత్యేక బృందాలను బ్యాంకర్లతో కలిసి ఏర్పాటు చేసి స్క్రుటిని చేయాలని, అర్హుల జాబితాను ఎంపిక చేసి జిల్లాకు పంపాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో తుది జాబితా రూపొందిస్తామన్నారు. ఏప్రిల్ 27వరకు మండల స్థాయిలో విచారణ పూర్తిచేసి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం.. చోద్యం..

- మద్యం వ్యాపారుల ఇష్టారాజ్యం..

- ప్రత్యేక 'కోడ్' స్టిక్కర్లతో బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా


మద్యం సీసాపై వేసిన స్టిక్కర్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో బెల్ట్ షాపుల నిరోధానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతి పొందిన మద్యం దుకాణాల వ్యాపారులు తమ విక్రయాలు జోరుగా సాగేందుకు ఊళ్లను పంచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లోని బెల్ట్ షాపులకు వెళ్లే మద్యం సీసాలకు దర్జాగా తమ షాపు 'కోడ్'తో స్టిక్కర్లు వేసి మరీ సరఫరా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'స్టిక్కర్ ఉంటే చాలు.. మీకేం భయం లేదు..' అంటూ అభయమిస్తున్నారని సమాచారం. దీంతో ఆయా బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం సీసాపై రూ.20లకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇదేమిటనీ ప్రశ్నిస్తే.. ఏం చేసుకుంటారో.. చేసుకోండి.. అంటూ దురుసుగా సమాధానం చెబుతున్నారని మందుబాబులు వాపోతున్నారు.

26 గ్రామాలు.. 80 బెల్ట్ షాపులు

మండలంలోని 26 గ్రామాల్లో మొత్తం 80 బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లిలో ప్రభుత్వ అనుమతి ఉన్న నాలుగు మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయి. ఒక్కో దుకాణం నిర్వాహకులు ఐదు, ఆరు గ్రామాలను పంచుకున్నట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో బెల్ట్ షాపులకు తమ దుకాణం నుంచి స్టిక్కర్లు వేసి ఉన్న మద్యం సీసాలను తరలిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపుల పక్కనే రెస్టారెంట్లను తలదన్నేలా పర్మిట్ రూంలు కొనసాగుతున్నాయి. అయినా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు..

- శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ, ఎల్లారెడ్డిపేట



మండలంలోని గ్రామాల్లో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయని ఫిర్యాదులు వస్తే దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. మండలంలోని మద్యం దుకాణాల నుంచి కాకుండా ఇతర మండలాల నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నారని, వైన్‌షాపు నిర్వాహకులు స్టిక్కర్లను వేస్తున్నారని గుర్తించాం. ప్రభుత్వ నిబంధన మేరకు అలా వేయకూడదు. వైన్‌షాపుల పక్కన పర్మిట్ రూముల్లో తినుబండారాలు విక్రయించరాదు.